మహా శివరాత్రికి సర్వం సిద్ధం

నల్లకుంటలోని న్యూరామాలయం

అంబర్‌పేట, మార్చి 7 : మహా శివరాత్రికి అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆలయాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆయా ఆలయాల్లో నిర్వహించనున్న పూజల వివరాలు ఇలా ఉన్నాయి.

☛ బాగ్‌అంబర్‌పేట ఛే నంబర్‌లోని శ్రీరామ్ మందిర్‌లో శ్రీశివ సీతారామాంజనేయ దేవస్థాన సొసైటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

శుక్రవారం ఉద యం 5 గంటల నుంచి సామూహికంగా ఏకవార రుద్రాభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తారు. రాత్రి 12 గంటల నుంచి లింగోద్భవకాల సమయంలో స్వామి వారికి విశేష అభిషేకములు, అర్చనలు, మహా హారతి ఉంటుందని సొసైటి ప్రతినిధులు గణేశ్, రమేశ్, మల్లేశ్, కిరణ్ తదితరులు తెలిపారు.

☛ నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ శివాలయం లో శుక్రవారం తెల్లవారు జాము నుంచే ప్రత్యే క అర్చనలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

☛ శివరోడ్డు లింగాలగడ్డా శివాలయంలో శుక్రవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు ఉంటాయి. రాత్రి పది గంటలకు దర్శనాలు, రాత్రి 11 గంటలకు శివపార్వతి కల్యాణం నిర్వహిస్తున్నారు. అలాగే పాత రామాలయంలో కూడా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు ఏర్పాట్లు చేశారు.

☛ న్యూనల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఉదయం 6 నుంచి 12 గంటల వరకు ఏక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నారు. రాత్రి శివకల్యాణం ఉంటుంది.

☛ నల్లకుంటలోని శంకరమఠంలో ఉదయం 6.30కు శక్తిగణపతి, మహాశివుడు, శారదాంబలకు రుద్రాభిషేకాలు, 9 గంటలకు అర్చన, 11 గంటల నుంచి 12 వరకు అమ్మవారి దర్శనం ఉంటుంది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అర్చన, 9 నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము ఉంటుంది.

☛ శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో ఉదయం 6 గంటలకు కాగడ హారతితో శివరాత్రి కార్యక్రమాలు మొదలవుతాయి. ఉదయం 8 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటుంది.

☛ అంబర్‌పేట చెన్నారెడ్డినగర్ శివాలయం, గోల్నాక వీరన్నగుట్ట మహా శివాలయంలో శివరాత్రి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాగ్‌అంబర్‌పేట తురాబ్‌నగర్, మల్లిఖార్జుననగర్‌లలో కూడా శివరాత్రి ఉత్సవాలను జరపడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్లు పూలు, పండ్లతో కలకలలాడుతున్నాయి. ప్రత్యేక పండ్ల విక్రయ కేంద్రాలు వెలిశాయి.

పటేల్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

భవిష్యత్ తరాల కోసం డ్రైనేజీ ప్రక్షాళన

గోల్నాక, మార్చి 7: అంబర్‌పేట నియోజవకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరి స్థానికులను వేధిస్తున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి భవిష్యత్ తరాలకు అనుగుణంగా పైప్‌లైన్ల ప్రక్షాళన చేపడుతున్నామని తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలసి రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నియోజవకర్గ మౌలిక వసతుల కల్పనలో భాగంగా పలు అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. అభివృద్ధికి నోచుకోని బస్తీల రూపురేఖలను మార్చి ఎలాంటి సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్‌ముదిరాజ్‌తో పాటు బస్తీ నాయకులు పాల్గొన్నారు.

బేగంబజార్ ఫిష్ మార్కెట్ దుకాణాలలో వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ అధికారులను కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌ను కలిసి గురువారం వినతి పత్రం సమర్పించారు. అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్, మార్చి 7

శివరాత్రికి సెలవులు రద్దు కక్ష్యసాధింపే

సుల్తాన్‌బజార్, మార్చి 7: శివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవును రద్దు చేయడం అంత్యంత దుర్మార్గమని, ఇది హిందువులపై కక్ష్యసాధింపేనని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పండరీనాథ్ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని నిలదీశారు. పంచాయితీరాజ్ ఉద్యోగులందరూ సెలవు దినాలలో కూడా విధులను నిర్వహించాలని జీవో జారీ చేయడం ప్రభుత్వం హిందువులపై కక్ష్య సాధింపు చర్యలలో భాగమేనని అన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు ప్రత్యేక సెలవులు ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం హిందూ వ్యతిరేక విధానాలకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్ర మంలో వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ బాలస్వామి, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు పాల్గొన్నారు.

కళాకృష్ణ, ఉమామహేశ్వరికి అక్కినేని.. పురస్కారం

తెలంగాణభాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిని ఆధ్వర్యంలో అక్కినేని శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సుప్రసిద్ధ నాట్యకళాకారుడు డా.కళాకృష్ణ, హరికథ భాగవతారిణి ఉమామహేశ్వరికి అక్కినేని లలితకళా పురస్కారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సారిపల్లి కొండల్‌రావు సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరావు విచ్చేసి జ్యోతి కళాకృష్ణ,ఉమామహేశ్వరికి పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. పార్వతీశం, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. – రవీంద్రభారతి, మార్చి7

9,10 తేదీల్లో నీటి సరఫరా ఉండదు

చిక్కడపల్లి, మార్చి 7 : గాంధీనగర్ డివిజన్ పరిధిలో 9, 10 తేదీల్లో తాగునీటి సరఫరా ఉండదని వాటర్‌వర్క్స్ గాంధీనగర్ మేనేజర్ కృష్ణ మోహన్ తెలిపారు. నగరానికి ఉస్మాన్ సాగర్ నుంచి మంచినీటి సరఫరా చేసే నీటి కాలువకు హకీంపేట ఎంఈఎస్ వద్ద భారీ లీకేజీ ఏర్పడింది. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం అర్ధరాత్రి 12 వరకు మరమ్మతులు చేపడుతున్నారని, దీంతో గాంధీనగర్, దోమలగూడ తదితర ప్రాంతాల్లో కూడా తాగునీటి సరఫరా ఉండదని ఆయన వెల్లడించారు.

మహిళలకు కామినేనిలో ఉచిత వైద్య పరీక్షలు

సుల్తాన్‌బజార్, మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినత్సోవం సంధర్భంగా కింగ్‌కోఠి కామినేని ఆసుపత్రిలో ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు ఉచిత రక్త, ఆరోగ్య పరీక్షలను నిర్వహించనున్నట్లు కామినేని ఆసుపత్రి చైర్మన్ కామినేని సూర్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, థైరాయిడ్ ఫంక్షన్ టెస్ట్, గైనకాలజీ కన్సల్టేషన్, అల్ట్రా సౌండ్ అబ్డామెన్ స్కానింగ్‌లు కింగ్ కోఠి కామినేని దవాఖానలో ఉచితంగా నిర్వహిస్తున్నామని, 7815978159 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

10 నుంచి గ్లకోమా వారోత్సవాలు

కంటిలో వచ్చే గ్లకోమా వ్యాధి సైలెంట్ కిల్లర్ అని, 40 ఏండ్లు నిండిన తర్వాత ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలను చేయించుకోవాలని మెహిదీపట్నం సరోజినిదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ నెల 10వ తేదీ నుంచి వారం రోజుల పాటు గ్లకోమా వారోత్సవాలను నిర్వహిస్తామని గురువారం ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్ఎంఓ నజాఫిబేగం, డాక్టర్లు వెంకటరత్నం, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం, మార్చి 7

వరద ముంపు సమస్యను పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మల్లికార్జుననగర్ బస్తీ ద్వారా వెళ్లే వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ఈఈ పేర్రాజుతో కలిసి మల్లికార్జుననగర్ వాసులు పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్ఎస్ నాయకులు కెంచె మహేశ్, మిర్యాల శ్రీనివాస్, జె. బాల్‌రాజు, సంజీవ్ చౌదరి, వినోద్‌గౌడ్, బస్తీవాసులు మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు. – అంబర్‌పేట, మార్చి 7

కుల్సుంపురాలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజల శాంతి భద్రతల కోసమే పోలీసులు ఉన్నారని, ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలిగినా పోలీసులను ఆశ్రయించాలని సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. కుల్సుంపురా డివిజన్‌లోని పోలీసులు గుడిమల్కాపూర్, టప్పాచబుత్రా, కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పలు ప్రాంతాలలో భారీ సంఖ్యలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అదనపు డీసీపీ అశ్వాక్, కుల్సుంపురా ఏసిపీ మునావర్, గుడి మల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజు, టప్పాచబుత్రా డీఐ ఆసిఫ్, ఎస్ఐలు పాల్గొన్నారు. – కార్వాన్, మార్చి7

నేడు యాదాద్రి ఆఖండ జ్యోతి రథయాత్ర

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి 30వ ఆఖండ జ్యోతి రథయాత్రను శుక్రవారం (నేడు) ఉదయం 9:30 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆఖండ జ్యోతి యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం బర్కత్‌పురలోని యాదాద్రి భవన్‌లో ఆయన మాట్లాడారు. ఈ యాత్రను ప్రారంభానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు వెంకట్‌రెడ్డి, సురేఖ, ప్రభుత్వ విప్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, యాదాద్రి ధర్మకర్త నర్సింహమూర్తి తదితరులు హాజరుకానున్నారు. – కాచిగూడ, మార్చి 7

కోఠిలోని ఆర్ఎఫ్‌పీటీసీ యూపీహెచ్‌సీలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పద్మజ

11 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం

సుల్తాన్‌బజార్, మార్చి 7: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కింగ్‌కోఠి క్లస్టర్ డాక్టర్ పద్మజ అన్నారు. గురువారం కోఠిలోని ఆర్ఎఫ్‌పీటీసీ యూపీహెచ్‌సీ ఆవరణలో ఈ నెల 11 నుంచి 24 వరకు నిర్వహించ తలపెట్టిన జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధి గ్రస్తుల గుర్తింపు ఉద్యమం 14 రోజుల లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్-2024 బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్పర్శలేని రాగి, గోధుమ రంగు మచ్చలు, కాళ్లు, చేతులలో తిమ్మిర్లు, మొద్దు బారి ఉన్నట్లయితే కుష్ఠు వ్యాధిగా భావించి ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని ఆరు యూపీహెచ్‌సీలు,13 బస్తీ దవాఖానాలకు చెందిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఈ క్యాంపెయిన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ రెడ్డి, డీపీఎంవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భర్తలపై కేసులు పెట్టే యోచనను మానుకోవాలి

కారణాలు లేకుండా ఇష్టం వచ్చినట్లు భర్తలపై కేసులు నమోదు చేసి వేధించడాన్ని కొంతమంది మహిళలు మానుకోవాలని 'సేవ్ ఇండియన్ ఫ్యామిలీ' నేతలు కోరారు. ఈ మేరకు గురువారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో ఉమెన్స్ డిగ్నిటీ డే పురస్కరించుకొని సేవ్ ఇండియన్ ఫ్యామిలీ నేతలు భార్యల మెయింటెనెన్స్ ఫండ్ పేరిట భిక్షాటన చేసి వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. సేవ్ ఇండియన్ ఫ్యామిలీ హైదరాబాద్ ఛాప్టర్ కౌన్సిలర్ కృష్ణారావు, సభ్యులు జునేద్, మునీర్, విజయ్ ఇనాయత్ తదితరులు మాట్లాడారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎమెన్స్ డిగ్నిటీ పేరిట కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. – కవాడిగూడ, మార్చి 7

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా రాణిస్తేనే దేశం ప్రగతిలో పథంలో దూసుకెళుతుందని వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా.కేతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలలో సేవలందించిన వారికి మహిళా సేవ సమ్మాన్ అవార్డ్సు బహూకరించారు. ఈ కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాసుదేవ రెడ్డి హాజరై పలువురు సామాజిక సేవా మూర్తులకు అవార్డులు బహూకరించారు. ముఠా జయసింహా, ఇమ్మడి సోమనర్సయ్య, సైరారబాను తదితరులు పాల్గొన్నారు. – రవీంద్రభారతి, మార్చి7

న్యాయవాద వృత్తి విలువలతో కూడుకున్నది

చిక్కడపల్లి, మార్చి 7 : న్యాయవాద వృత్తి విలువలతో కూడుకున్నదని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి గోడ రాఘురామ్ అన్నారు. చిక్కడపల్లి లోని పెండెకంటి న్యాయ కళాశాల విద్యార్థులు వార్షిక ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రఘురామ్, ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ విభాగం డీన్ ప్రొఫెసర్ డాక్టర్ బి. విజయలక్ష్మి హాజరై ప్రతిభ పురస్కారాలను అందజేశారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ముఠా గుట్టురట్టు

సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ద్విచక్ర వాహనాలు, ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టయ్యింది. సీసీఎస్, స్పెషల్ జోనల్ క్రైమ్ పోలీసులు వారిని అరెస్టు చేసి రూ.10లక్షల విలువ చేసే 5 ద్విచక్ర వాహనాలు, 3 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జియాగూడకు చెందిన గోపి అరుణ్ (21), బి.సాయినాథ్(20) పాతనేరస్తులు. యుగ్(22), జిత్తు(20)లతో కలిసి అరుణ్ మాదాపూర్, కేపీహెచ్‌బీ పీఎస్‌ల పరిధిలో 4వాహనాలను దొంగిలించారు. సాయినాథ్‌తో కలిసి మాదాపూర్ పరిధిలో ఫోన్లను దొంగిలించారు. గురువారం వాహనాలను నాంపల్లిలో విక్రయించేందుకు యత్నిస్తుండగా అరుణ్, సాయినాథ్‌లను అరెస్టు చేశారు. కాగా యుగ్, జిత్తు పరారీలో ఉన్నారు.

ఉత్తమ్‌కు వినతిపత్రం

మేరు కులస్థులు ఆర్థిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని మేరు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులు పొల్కం శ్రీనివాస్, మునగాల రాములు, సిగు విష్ణు, మునిగాల రమేశ్ మంత్రిని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. – అబిడ్స్, మార్చి 7

నేడు శివ జాగరణ..

అబిడ్స్, మార్చి 7 : మహా శివరాత్రిని పురస్కరించుకుని రహీంపురా సత్తన్నగల్లిలోని శ్రీ శంకర్‌జీ హనుమాన్ జీ, అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో శ్రీ శివ మహా జాగరణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీ మహా శివరాత్రి జాగరణ సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందంగుప్తా తెలిపారు. మంత్రి కొండా సురేఖ, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని వివరించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

మెహిదీపట్నం, మార్చి 7: వేసనిలో అగ్నిప్రమాదాలను నివారించడానికి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని లంగర్‌హౌస్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ దత్తు అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో లంగర్‌హౌస్ ఫైర్‌స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 7: ఇండ్లు కూల్చిన చోటే వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి న్యాయం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. గురువారం బాధితులు, బస్తీ నాయకుడు ఎంబీ కృష్ణ చేపట్టిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పి.శంకర్, కార్యదర్శి పలి కల్పన వారికి నిమ్మరం ఇచ్చి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, జ్ఞానేశ్వరి, భారతి, సువర్ణ, సునీత, పూజ, సాయిరాం, భాగ్య లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి

ఎమ్మెల్యే ముఠా గోపాల్

భోలక్‌పూర్ హౌజ్ వద్ద నీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ/ముషీరాబాద్, మార్చి 7: భోలక్‌పూర్ హౌస్ వద్ద 30 ఏండ్ల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మోడల్ రోడ్లు వేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ హౌస్ వద్ద రూ. 56 లక్షల వ్యయంతో చేపట్టనున్న నీసీ రోడ్డు పనులను ఆయన డివిజన్ కార్పొరేటర్ గౌసొద్దీన్ తహతో కలిసి ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, వై. శ్రీనివాస్‌రావు, ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

● రంజాన్ ప్రారంభం సదర్భంగా ముస్లింలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు గురువారం ముషీరాబాద్‌లోని ఆర్య వైశ్య భవన్‌లో రంజాన్ మాసం సందర్భంగా మైనారిటీలు ఇబ్బందులు పడకుండా పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. వాటర్ వర్క్స్ అధికారులు, జీఎం రామకృష్ణ, డీజీఎం మోహన్ రాజ్, కార్తిక్ రెడ్డి, మేత్రైయి పాల్గొన్నారు.

● విద్యానగర్ వివేకానంద పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గో పాల్ పాల్గొని అధ్యాపకులను సత్కరించారు. నాయకులు ముఠా జయసింహ, కె.సురేందర్, అనూరాధ, మాధవి పాల్గొన్నారు.

నియోనటల్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌ను ప్రారంభించి ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క

సేవా కార్యక్రమాలు కొనసాగించాలి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 7: పోలియో వ్యాధి నివారణకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. నీలోఫర్ దవాఖానలో రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన నియోనటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. నీలోఫర్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యూనిట్‌ను నెలకొల్పేందుకు రోటరీ క్లబ్ రూ.48 లక్షలు అందించడం ప్రశంసనీయమన్నారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద భద్రత

నేడు శివరాత్రి సందర్భంగా పీఎస్ పరిధిలోని ఆలయాల వద్ద పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ గౌడ సంఘం జాయింట్ సెక్రటరీ, కాచిగూడ జమాల్‌బస్తీ గౌడ సంఘం అధ్యక్షుడు కృష్ణా గౌడ్ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. సత్యనారాయణగౌడ్, మహేందర్‌గౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు. – కాచిగూడ

వెలిచేటికి గౌరవ డాక్టరేట్

తెలుగు యూనివర్సిటీ, మార్చి 7 బాల్యంనుంచే పాటలు పాడుతూ ఎంతో మంది ఔత్సాహికులను కళాకారులుగా తీర్చిదిద్దిన వెలిచేటి సత్యనారాయణ మూర్తి చేస్తున్న సామాజిక సేవ ఎనలేనిదని వక్తలు ప్రశంసించారు. చిన్నారులను ప్రోత్సహిస్తూ కళాకారులుగా తీర్చిదిద్దుతున్న వెలిచేటి చేస్తున్న సేవలకుగాను ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ న్యూ ఢిల్లీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సత్కరించింది.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత నివ్వాలి

కవాడిగూడ, మార్చి 7: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్ అన్నారు. గురువారం ముషీరాబాద్, మొరంబొంద ప్రభుత్వ పాఠశాలలను ఆయన ముషీరాబాద్ డిప్యూటీ ఈఓ చిరంజీవి, ఐఓఎస్ స్వరూపరాణితో కలిసి సందర్శించి మాట్లాడుతూ.. తన ఎంపీ నిధుల నుంచి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బేస్‌మెంట్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

అబిడ్స్, మార్చి 7 : సెట్ బ్యాంక్ లేకుండా బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తూ పక్కనే ఉన్న కురుమ సంఘం భవనం బేస్‌మెంట్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కురుమ సంఘం కోశాధికారి కట్ట మల్లేషం, అధ్యక్షుడు చిందం మధుసూదన్ అధికారులను కోరారు. గౌలిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బేగంబజార్ డివిజన్ కురుమ సంఘం 15-4-211 ఇంటి నంబర్‌లో ఉందని, భవనానికి పక్కనే అజయ్, సంజయ్‌లు బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని అన్నారు.

సేవాభావంతోనే గుర్తింపు

ఫెవికాల్ చాంపియన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అంబర్‌పేట లోని నిరాశ్రయ మహిళలు, ఆనాథ బాలికలకు స్మార్ట్ టీవీలను ఫెవికాల్ చాంపియన్ క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి శ్రీహరి ఉచితంగా పంపిణీ చేశారు. గొట్టాల వినోద్‌చారి, రీజినల్ మేనేజర్ అజయ్ ఠాకూర్, ఫెరోజ్, పడకంటి అంజయ్యచారి, పాలోజు వేణుగోపాల్, సంజీవచారి తదితరులు పాల్గొన్నారు. – కాచిగూడ, మార్చి 7

10న భగవద్గీత తాత్పర్యం ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, మార్చి7: సంగీత దర్శకుడు ఆర్.పి పట్నాయక్ విరచిత ఆధ్యాత్మిక ఆల్బమ్ సంపూర్ణ భగవద్గీత తాత్పర్యం ఆవిష్కరణ సభ బంజారాహిల్స్ ప్రసాద్ ఫిలిం ల్యాబొరేటరీస్‌లో మార్చి 10న సాయంత్రం 6 గంటలకు ఆవిష్కరిస్తున్నట్లుని సినెటోరియా మీడియా వర్క్స్ అధినేత వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. భగవద్గీత గ్రంథంలోని తాత్విక సంభాషణ, గీత వాస్తవికత స్వభావం, సమాజానికి విముక్తి మార్గంతో సహా అనే అంశాల సమాహారంగా రూపొందించిన ఆల్బమ్ ఆవిష్కరణ ఉందని వెల్లడించారు. పూర్తి సంస్కృతంలో ఉండ